

https://amaravathivelugu.com

RNI No. : APTEL/2022/85169

అమరావతి తెలుగు

సంచలన తెలుగు దినపత్రిక

రిపోర్టర్లు కావలెను

పాత్రికేయులుగా పని చేయాలన్న ఉత్సాహం
మీ ప్రాంత స్థితిగతులపై అవగాహన
తెలుగులో రాయగలిగిన భాషా పరిజ్ఞానం ఉన్న
ఔత్సాహికులకు ఇదే మా ఆహ్వానం

అనంతపురం జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రాల్లో
న్యూస్ కంట్రీబ్యూటర్లు కావలెను.
విషయ పరిజ్ఞానంతో పాటు సామాజిక,
రాజకీయ అవగాహన కలిగి స్థానికులై ఉండాలి.
వివరాలకు సంప్రదించండి :
జానపాటి వెంకట రమేష్ బాబు
ఎడిటర్
9440814576

సంపుటి : 04 సంచిక : 194 ప్రచురణ : శ్రీ సత్యసాయి/అనంతపురం ఎడిటర్ : జానపాటి వెంకట రమేష్ బాబు ఆదివారం, నవంబరు 15, 2026 పేజీలు : 4 వెల : ₹2/-

Circulated at Guntur, Palnadu, Bapatla, Chittoor, Tirupati, Madanapalli, Kurnool, Nandyal, Visakapatnam, Vijayawada, Kadikana, Kadapa, Nellore, Rajamendravaram



భారత్ మండపంలో అంబరాన్ని అంటిన..

ఏపీ కీర్తి ప్రతిష్టలు..

రాష్ట్ర ఉత్పత్తులకు జాతీయ స్థాయి గుర్తింపు

దేశ రాజధాని ఢిల్లీలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైభవం మరోసారి అంతర్జాతీయ వేదికపై మెరిసింది. భారత్ మండపంలో ప్రారంభమైన ఇండియా ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫేర్‌లో ఏపీ పెవిలియన్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు, రుచికరమైన వంటకాలు, అరుదైన హస్తకళలు, ప్రత్యేక ఉత్పత్తులను ప్రపంచానికి పరిచయం చేస్తూ ఆంధ్రప్రదేశ్ తన ప్రత్యేకతను చాటుకుంటోంది. నవంబర్ 14 నుంచి 27 వరకు కొనసాగనున్న ఈ వాణిజ్య ప్రదర్శనలో ఏపీ పెవిలియన్‌కు సందర్శకుల నుంచి విశేష స్పందన లభిస్తోంది.

దేశ రాజధాని ఢిల్లీ భారత్ మండపం వేదికగా ఇండియా ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫేర్ ప్రారంభమైంది. నవంబర్ 14-27 వరకు జరగనున్న ట్రేడ్ ఫేర్ లో ఆంధ్రప్రదేశ్ పెవిలియన్ అద్భుతంగా, అత్యంత వైభవంగా ప్రారంభమైంది. ఏపీ భవన్ స్పెషల్ కమిషనర్ ఆర్జా శ్రీకాంత్ ఈ పెవిలియన్‌ను అధికారికంగా ప్రారంభించారు. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున మంత్రులతో కాకుండా పెవిలియన్ ప్రారంభ కార్యక్రమం జరిగింది. రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు, వంటకాలు, అపురూపమైన హస్తకళల నైపుణ్యాన్ని,ప్రత్యేక ఉత్పత్తులను అంతర్జాతీయ వేదికపై సగర్వంగా ప్రదర్శిస్తూ ఏపీ బ్రాండ్ ఇమేజ్‌ను అంబరాన్ని తాకేలా చేస్తున్న ఈ ప్రదర్శనకు విశేష స్పందన లభిస్తుంది.. ఈ అంతర్జాతీయ స్థాయి ట్రేడ్ ఫేర్‌లో ఆంధ్రప్రదేశ్ 28 జిల్లాల నలుమూలల నుంచి సుమారు 200 మందికి పైగా చేనేత కళాకారులు, హస్తకళాకారులు , వినూత్న ఉత్పత్తుల తయారీదారులు స్వయంగా పాల్గొని అమ్ముకునే విధంగా ప్రత్యేక 42 స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. స్థానిక కళాకారుల ప్రతిభకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చేలా, ఏపీ వ్యాపారుల వ్యాపారాన్ని

..2వ పేజీలో



2047లోపు దేశంలోనే నంబర్ వన్‌గా

తెలంగాణ..!!

వైద్య రంగంపై తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది

రాష్ట్రంలో త్వరలోనే మరిన్ని హాస్పిటల్స్ రాబోతున్నాయి...

ఆహార కొరత లేదు..కానీ తినే ఫుడ్‌లో న్యూట్రిషన్ కొరత ఉంది

మన లైఫ్ టైం 70 ఏళ్లకు తగ్గిపోయింది...

ప్రజలు ఉత్తమ వైద్యం కోసం హైదరాబాద్ వైపు చూస్తున్నారు..

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి


వైద్య రంగంపై తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. పబ్లిక్ హెల్త్ సైన్సెస్ క్యాంపస్ నిర్మాణానికి శనివారం హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణలో ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పబ్లిక్ హెల్త్ సైన్సెస్ క్యాంపస్ మాస్టర్ ప్లాన్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రంలో త్వరలోనే మరిన్ని హాస్పిటల్స్ రాబోతున్నాయని చెప్పారు. ఆహార కొరత లేదు..కానీ తినే ఫుడ్‌లో న్యూట్రిషన్ కొరత ఉందన్నారు. మన లైఫ్ టైం 70 ఏళ్లకు తగ్గిపోయిందన్నారు. ప్రజలు ఉత్తమ వైద్యం కోసం హైదరాబాద్ వైపు చూస్తున్నారని తెలిపారు.

బాలల అభ్యున్నతితోనే...


రాష్ట్ర ప్రగతి..దేశ ప్రగతి

జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా బాలలందరికీ శుభాకాంక్షలు

- చిన్నారుల భవిష్యత్తుకు భరోసా కల్పించేలా విద్య, నైపుణ్యాలు,
- విలువలతో కూడిన సమగ్ర వికాసానికి కట్టుబడి ఉన్నాం...
- నేటి బాలలే రేపటి యువత.. దేశ భవితకు పునాదులు...
- పిల్లల కలలను సాకారం చేసేలా తీర్చిదిద్దడం అందరి బాధ్యత
- బాలల అభ్యున్నతితోనే రాష్ట్రం, దేశ ప్రగతి సాధ్యమని ఆకాంక్షించారు
- రేపటి గొప్ప భవిష్యత్తుకు చిన్నారులే పునాదులు : చంద్రబాబు



అమరావతి: జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా బాలలందరికీ ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్య శాఖ మంత్రి నారా లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారుల భవిష్యత్తుకు భరోసా కల్పించేలా విద్య, నైపుణ్యాలు, విలువలతో కూడిన సమగ్ర వికాసానికి కట్టుబడి ఉన్నామని చంద్రబాబు స్పష్టం చేశారు. నేటి బాలలే రేపటి యువత.. దేశ భవితకు పునాదులని తెలిపారు. పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారి కలలను సాకారం చేసేలా ఆత్మవిశ్వాసంతో తీర్చిదిద్దడం అందరి బాధ్యతన్నారు. బాలల అభ్యున్నతితోనే రాష్ట్రం, దేశ ప్రగతి సాధ్యమని ఆకాంక్షించారు. రేపటి గొప్ప భవిష్యత్తుకు చిన్నారులే పునాదులని మంత్రి లోకేశ్ అన్నారు.



గ్రామస్థాయి ఎన్నికలను తేలిగ్గా... తీసుకోవద్దు

: సీఎం చంద్రబాబు

అమరావతి: గ్రామస్థాయి ఎన్నికలను పార్టీ నేతలు తేలిగ్గా తీసుకోవద్దని తెదేపా అధినేత, సీఎం చంద్రబాబు పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. తెదేపా ముఖ్యనేతల తో టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన చంద్రబాబు.. స్థానిక ఎన్నికలపై చర్చించారు. ఈవీఎం, బ్యాలెట్, పోస్టల్ ఏ విధానమైన కూటమిదే హవా అన్నారు. క్షేత్రస్థాయిలో నేతలను తీర్చిదిద్దేందుకు ఈ ఎన్నికలను మంచి అవకాశంగా తీసుకోవాలని సూచించారు. గ్రామస్థాయిలోనూ కూటమి బలపరిచే అభ్యర్థులనే గెలిపించాలని ఆదేశించారు.

ఏపీలో మరో పెను...

తుఫాన్..!!

తీరం వైపు దూసుకొస్తున్న అక్వాన్ తుఫాన్.. భారీ వర్షాలు..

- ఇప్పటికే అర్నబ్, మురసు తుఫాన్లు ఏపీలో అల్లకల్లోలం
- ఈ నెల 16న తుఫాన్‌గా మారే అవకాశముంది
- దీంతో ఏపీలో భారీ వర్షాలు కురవనున్నాయి...
- సముద్రం అల్లకల్లోలంగా మారే అవకాశముంది
- తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..



నిన్నటి అగ్నేయ బంగాళాఖాతంలో ఉన్న సుస్పష్ట అల్పపీడన ప్రాంతం.. నవంబర్ 14న ఉదయం 08:30 గంటల సమయానికి అదే ప్రాంతంలో కొనసాగుతోంది. దీనికి

..2లో..

ఏపీలో మరో తుఫాన్ ముంచుకొస్తుంది, ఇప్పటికే అర్నబ్, మురసు తుఫాన్లు ఏపీలో అల్లకల్లోలం సృష్టించగా.. ఇప్పుడు మరో తుఫాన్ గండం ఏర్పడింది. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ఈ నెల 16న తుఫాన్‌గా మారే అవకాశముందని వాతావరణశాఖ అంచనా వేసింది. దీంతో ఏపీలో భారీ వర్షాలు కురవనున్నాయి.

'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా

ఆర్యవీర్ సెహ్వాగ్..

వీరూ ఎంతో గర్వపడుతుంటాడు: గంగూలీ

వావ్ వాట్ ఏ మ్యాచ్!: వీరేంద్ర సెహ్వాగ్

యువ జట్టుకు అభినందనలు: సౌరభ్ గంగూలీ



పాకిస్థాన్‌పై అద్భుత విజయం సాధించి అండర్-19 ఆసియా కప్‌ను సొంతం చేసుకున్న భారత యువ జట్టుపై ప్రశంసల వర్షం కురుస్తోంది. ఈ టోర్నీలో అద్భుత ప్రదర్శన కనబర్చిన క్రికెట్ దిగ్గజం వీరేంద్ర సెహ్వాగ్ తనయుడు ఆర్యవీర్.. 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా నిలిచాడు. 5 ఇన్నింగ్స్‌ల్లో 361 పరుగులతో రాణించాడు. ఇందులో ఒక సెంచరీ, మూడు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ఇదిలా ఉంటే, క్రికెట్ దిగ్గజాలు వీరేంద్ర సెహ్వాగ్, సౌరభ్ గంగూలీ, వీవీఎస్ లక్ష్మణ్ తదితరులు టీమిండియా కుర్రాళ్ల పోరాట పటిమను కొనియాడారు. ఎక్స్ వేదికగా పోస్ట్‌లు పెడుతున్నారు.

వావ్ వాట్ ఏ మ్యాచ్!: వీరేంద్ర సెహ్వాగ్

'వావ్ వాట్ ఏ మ్యాచ్! ఎంత అద్భుతమైన ! అండర్-19 ఆసియా కప్ ఫైనల్‌లో 338 పరుగుల లక్ష్యాన్ని ఛేదిస్తూ పాకిస్థాన్‌ను ఓడించాలంటే ఎంతో పట్టుదల, పోరాట పటిమ ఉండాలి. లక్ష్య(80), ఆర్యవీర్(58)

..2లో..



భారత అండర్ 19 క్రికెట్ జట్టుకు సీఎం చంద్రబాబు

అభినందనలు

పాకిస్థాన్‌పై చివరి బంతికి సంచలన విజయం సాధించడం చరిత్రాత్మకం

ఆసియా కప్ అండర్-19 ఫైనల్‌లో పాకిస్థాన్‌పై చివరి బంతికి టీమిండియా సంచలన విజయం సాధించింది

పాకిస్థాన్ నిర్దేశించిన భారీ లక్ష్యాన్ని ఛేదించడంలో భారత జట్టు అసాధారణ సంయమనం

చాంపియన్స్‌గా నిలిచిన భారత అండర్-19 జట్టు సభ్యులందరికీ ఆయన శుభాకాంక్షలు

పురుషుల అండర్-19 ఆసియా కప్ 2026 ట్రోఫీ గెలిచిన టీమిండియాపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశంసల జల్లు కురిపించారు. ఎక్స్ వేదికగా జట్టుకు బాబు అభినందనలు తెలిపారు. పాకిస్థాన్‌పై చివరి బంతికి సంచలన విజయం సాధించడం చరిత్రాత్మక, అద్భుతమైన క్షణమని ఆయన పేర్కొన్నారు. ఆసియా కప్ అండర్-19 ఫైనల్‌లో పాకిస్థాన్‌పై చివరి బంతికి టీమిండియా సంచలన విజయం సాధించిందని కొనియాడారు. పాకిస్థాన్ నిర్దేశించిన భారీ లక్ష్యాన్ని ఛేదించడంలో భారత జట్టు అసాధారణ సంయమనం,

..2వ పేజీలో

ఏపీలో మరో పెను తుఫాన్..!!

(మొదటిపేజీ తరువాయి)

అనుబంధంగా ఉన్న ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉంది. ఇది వాయవ్య దిశగా పయనించి రాబోయే 24 గంటల్లో అదే ప్రాంతంలో వాయుగుండముగా బలపడే అవకాశం ఉంది. ఆ తర్వాత ఇది ఉత్తర-వాయవ్య దిశగా కదులుతూ, నవంబర్ 16 సాయంత్రం సమయానికి దక్షిణ బంగాళాఖాతం మధ్య ప్రాంతాలు, దానికి ఆనుకుని ఉన్న పశ్చిమ-మధ్య బంగాళాఖాతంలో తుపానుగా మరింత బలపడే అవకాశం ఉంది. దీంతో పాటు ఆంధ్రప్రదేశ్, యానంలో దిగువ ట్రోపో ఆవరణములో ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయి. వీటి ఫలితంగా రాష్ట్రంలో రాగల మూడు రోజుల వరకు వాతావరణ సూచనలను అమరావతి వాతావరణశాఖ విడుదల చేసింది.

ఈ ప్రాంతంలో తీరం దాటే అవకాశం.. కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాంలో ఈరోజు ,రేపు, ఎల్లుండి పొడి వాతావరణం ఏర్పడే అవకాశముందని అమరావతి వాతవరణశాఖ స్పష్టం చేసింది. అలాగే రాయలసీమలో ఈరోజు ,రేపు, ఎల్లుండి పొడి వాతావరణం ఏర్పడే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. తుఫాన్ క్రమంలో సముద్రంలో అలలు ఎగిసిపడే అవకాశమున్న క్రమంలో మత్స్యకారులు చేపలవేటకు వెళ్లవద్దని వాతావరణశాఖ హెచ్చరించింది. సముద్రం అల్లకల్లోలంగా మారే అవకాశముందని, తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపింది. ఏపీలో ఇప్పటివకే అర్నబ్, మురసు తుఫాన్ ప్రభావంతో పంటలు దెబ్బతిన్నాయి. వేలాది ఎకరాల్లో పంటలు నష్టపోవడంతో రైతులు నిరాశలో ఉన్నారు. అలాగే రోడ్లు, విద్యుత్ స్తంభాలు బాగా దెబ్బతిన్నాయి. అలాగే పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా కట్ అయింది. దీంతో అధికారులు వీటిని పునురుద్దరించారు. ఇప్పుడు మరో తుఫాన్ ముప్పు పొంచి ఉండగా.. ఇది మచిలీపట్నం, విశాఖపట్నం మధ్య తీరం దాటే అవకాశముందని అంచనా వేశారు. తీరం దాటే సమయంలో దీని తీవ్రత ఎక్కువగా ఉంటుంది. బలమైన ఈదురుగాలులు, వర్షాలు పడే అకాశముంది.

భారీ వర్షాలే... ఈ తుఫాన్ ప్రభావంతో ఏపీలో రాబోయే రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ప్రస్తుతం వస్తున్న తుఫాన్ తీవ్ర తుఫాన్‌గా రూపాంతరం చెందే అవకాశముందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఏపీలో వరుస తుఫాన్లలో ప్రజల్లో ఆందోళన నెలకొంది. వరుస తుఫాన్లు తీవ్ర నష్టాన్ని మిగుల్చుతున్నాయి. ఈ తుఫాన్‌కు అక్వాన్ అనే నామకరణం చేశారు. ఇరాన్ ఈ పేరును సూచించింది. ఈ తుఫాన్ ప్రభావం ఎలా ఉంటుందనే దానిపై వాతావరణశాఖ ఎప్పటికప్పుడు నివేదికలు విడుదల చేస్తోంది.

భారత అండర్ 19 క్రికెట్ జట్టుకు సీఎం
చంద్రబాబు అభినందనలు

(మొదటిపేజీ తరువాయి) సమష్టి కృషిని ప్రదర్శించిందని ప్రశంసించారు. చాంపియన్స్‌గా నిలిచిన భారత అండర్-19 జట్టు సభ్యులందరికీ ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు.

'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా ఆర్యవీర్ సెహ్వాగ్..

(మొదటిపేజీ తరువాయి) రాణించారు. ఆ తర్వాత మనల్ చౌహాన్(47), మోహిత్ ఉల్వా(49లి) అద్భుతం చేశారు. ఇది నమ్మశక్యం కాని విజయం. ఈ యువ ఛాంపియన్లను చూస్తుంటే గర్వంగా అనిపిస్తోంది' అంటూ వీరేంద్ర సెహ్వాగ్ పోస్ట్ చేశాడు.

యువ జట్టుకు అభినందనలు: సౌరభ్ గంగూలీ

'భారత అండర్-19 జట్టుకు అభినందనలు. అద్భుతమైన ప్రదర్శన చేశారు. యువ సెహ్వాగ్ ఈ టోర్నీలో ఎంతో గొప్పగా ఆడాడు! జట్టులోని ప్రతి ఒక్కరూ బాగా రాణించారు. వీరూ(వీరేంద్ర సెహ్వాగ్) ఎంతో గర్వపడుతుంటాడు' అని గంగూలీ పేర్కొన్నాడు.

అద్భుతం చేశారు: వీవీఎస్ లక్ష్మణ్

'కుర్రాళ్లకు హృదయపూర్వక అభినందనలు. ఒత్తిడిలో మీరు చూపిన పట్టుదల, పోరాటం, ప్రశాంతత అద్భుతం. కీలక సమయంలో గొప్ప నమ్మకం, సంకల్పంతో ఆడారు. భారతదేశానికి ప్రాతినిధ్యం వహించిన తీరుపై గర్వంగా ఉంది. ఇలాగే నేర్చుకుంటూ మరింత ఉన్నత స్థాయికి ఎదగండి' అని వీవీఎస్ లక్ష్మణ్ పేర్కొన్నాడు.


భారత్-చైనా సరిహద్దు క్రియాశీలంగా
మారింది: జైశంకర్

దిల్లీ: భారత్-చైనా సరిహద్దులో కార్యకలాపాలు ఎక్కువయ్యాయని, దీంతో పెద్దమొత్తంలో సైనికులను మోహరించాల్సిన అవసరం ఏర్పడిందని విదేశాంగశాఖ మంత్రి జైశంకర్ అన్నారు. 2020లో గల్వాన్ ఘటన తర్వాత వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ) వెంబడి భారత్ సైనిక సామర్థ్యాలను బలోపేతం చేసుకుందన్నారు. సరిహద్దులో మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ఆయన వెల్లడించారు. దిల్లీలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... ఎల్ఏసీ వెంబడి ప్రతిష్టంభనను తొలగించేందుకు ఇరుదేశాలు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. " పత్రికల్లో, టీవీల్లో మీరు చూసే ఉంటారు. సరిహద్దుల్లో సొరంగ మార్గం ఏర్పాటు చేసుకున్నాం, సరికొత్త టెక్నాలజీతో వంతెనలు, విమానాశ్రయాలు ఏర్పాటు చేసుకున్నాం. భారత్- చైనా సరిహద్దుల్లో మునుపటి పరిస్థితులు లేవు. అందుకే నిరంతర ప్రాతిపదికన మరింత సైనిక శక్తి అవసరమవుతోంది. ఇప్పటికే ఆ దిశగా చర్యలు చేపట్టడం వల్లే.. అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే సైనికదళాలను మోహరించడం సాధ్యపడింది" అని జైశంకర్ అన్నారు. 2014 ముందు వరకు సరిహద్దు మౌలిక సదుపాయాలు నిర్లక్ష్యానికి గురయ్యాయని జైశంకర్ విమర్శించారు. దీనికి సంబంధించిన ఆధారాలు కూడా ఉన్నాయన్నారు. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. రక్షణ మౌలిక సదుపాయాల కల్పనలో వేగం పెరిగిందన్నారు. క్షేత్ర స్థాయికి వెళ్లి పరిశీలిస్తే సరిహద్దుల్లో ఏటా ఎన్నికిలోమీటర్ల మేర రోడ్లు వేశారు. సొరంగాల తవ్వకం ఎలా జరిగింది. రక్షణ చర్యలకు వీలుగా వాటి నిర్మాణం చేపట్టారా? లేదా? తదితర విషయాలు తెలుస్తాయని ఆయన అన్నారు.



రూ.15వేల జీతం..
కానీ, రూ.350 కోట్ల లావాదేవీలు


బళ్లారి: కర్ణాటకలోని బళ్లారిలో భారీ మోసం వెలుగు చూసింది. ఓ సాధారణ ఉద్యోగి పేరుమీద ఏకంగా రూ.350 కోట్ల వ్యాపార లావాదేవీలు జరగడం కలకలం రేపింది. నకిలీ



పత్రాలు సృష్టించి, అతడి గుర్తింపు పత్రాలతో బ్యాంకు ఖాతా తెరిచిన మోసగాళ్లు, భారీ మొత్తంలో ఆర్థిక లావాదేవీలు నిర్వహించినట్లు తెలిసింది. విషయం తెలిసి తీవ్ర ఆందోళనకు గురైన బాధిత యువకుడు పోలీసులను ఆశ్రయించాడు. బళ్లారి నగరానికి చెందిన రోషన్ జమీల్ అనే యువకుడు స్థానికంగా ఓ కార్ల షోరూమ్‌లో ఉద్యోగి. నెల జీతం రూ.15 వేలు మాత్రమే. తండ్రి ఓ గోదాములో కూలీ. అయితే, రోషన్ ఆధార్, పాన్, బ్యాంకు ఖాతా వివరాలు, విద్యుత్ బిల్లు తదితర వ్యక్తిగత పత్రాలను కొందరు మోసగాళ్లు దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. నకిలీ పత్రాలు సృష్టించి 'రోషన్ ఎంటర్‌ప్రైజెస్' పేరుతో ఓ ప్లాస్టిక్ వ్యాపార సంస్థను ఏర్పాటు చేసిన నిందితులు.. భారీ మొత్తంలో లావాదేవీలు నిర్వహించారు. గతేడాది మే నుంచి అక్టోబర్ వరకు రూ.350 కోట్ల మేర లావాదేవీలు నిర్వహించినట్లు సమాచారం. అయితే, ఇటీవల ఖాతా మూసివేయడంతో అప్రమత్తమైన జీఎస్టీ అధికారులు నోటీసులు ఇచ్చేందుకు రోషన్ ఇంటికి వెళ్లి విచారించగా.. అసలు విషయం వెలుగు చూసింది. దీనిపై పూర్తి వివరాలు తెలియజేయాలని జీఎస్టీ అధికారులను యువకుడు సంప్రదించినప్పటికీ సరైన స్పందన రాలేదు. దీంతో తల్లిదండ్రులతో కలిసి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ స్థాయిలో వ్యాపారం జరుగుతున్న విషయం తనకు తెలియదని పేర్కొన్నాడు. మొబైల్ నంబర్, ఈ-మెయిల్ సైతం తనవి కాదని చెప్పాడు. తన వ్యక్తిగత గుర్తింపు పత్రాలను దుర్వినియోగం చేసి భారీ మోసానికి పాల్పడినట్లు తెలుస్తోందని, మోసగాళ్లపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశాడు. దర్యాప్తు మొదలుపెట్టిన బళ్లారి పోలీసులు.. ఆధారాలను సేకరించే పనిలో నిమగ్నమైనట్లు తెలిసింది.

వరాహ నదిలో స్నానానికి దిగి ముగ్గురు గల్లంతు

ఎస్. రాయవరం: అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం పెనుగొల్లు వద్ద వరాహ నదిలో స్నానానికి దిగి ముగ్గురు యువకులు గల్లంతయ్యారు. గ్రామానికి చెందిన కేతేటి రిషి (18), కోడి జగదీష్ (20), ముప్పిడి నాగవంశీ (22) మరో ముగ్గురు యువకులతో కలిసి పెనుగొల్లు గ్రోయిన్ వద్ద స్నానానికి దిగారు. ఆరుగురు నదిలో కొట్టుకుపోతుండగా స్థానికులు ముగ్గురిని కాపాడగా, మరో ముగ్గురూ గల్లంతయ్యారు. వెంటనే స్థానికులు నదిలోకి దిగి గాలింపు చేపట్టినా వారి ఆచూకీ లభించలేదు. సీఐ రామకృష్ణ, ఎస్సై రమేష్, ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. పోలవరం నుంచి గజ ఈతగాళ్లను రప్పించి గాలింపు చర్యలు చేపట్టనున్నారు. ముగ్గురు యువకులు గల్లంతవడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి



భారత్ మండపంలో అంబరాన్ని అంటిన ఏపీ కీర్తి ప్రతిష్టలు..

(మొదటిపేజీ తరువాయి) మరింత ప్రోత్సహించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది ఏపీకి మాత్రమే ప్రత్యేకమైన, దేశంలో ఎక్కడా లభించని ఎన్నో అరుదైన కళాఖండాలు ఈ పెవిలియన్‌ను సందర్శించే వారిని మంత్రముగ్ధులను చేస్తున్నాయి. మంగలగిరి, వెంకటగిరి, ధర్మవరం ప్రాంతాలకు చెందిన ప్రపంచ ప్రసిద్ధిగాంచిన చేనేత వస్త్రాలు. అద్భుతమైన నైపుణ్యంతో రూపుదిద్దుకున్న కలంకారి వస్త్ర కళాఖండాలు. చిన్నారులను, పెద్దలను ఒకేలా అలరించే ప్రసిద్ధ ఏటికొప్పాక , కొండపల్లి చెక్క బొమ్మలు.ఆకట్టుకునే విశాఖపట్నం లాకో వస్తువులు, అలాగే శ్రీకాకుళం, వైజాగ్ ప్రాంతాల గిరిజన ప్రత్యేక ఉత్పత్తులు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. అలాగే జిల్లాల వారీగా తిరుపతి పెన్ కలంకారి ,వుడ్ కార్వింగ్ కృష్ణ కలంకారి, ఇమిటేషన్ జ్యువెల్లరీ ,జీడిపప్పు,పశ్చిమ గోదావరి క్రోచెట్ లేస్ సత్యసాయి లెదర్ పప్పెట్రీ ,పల్నాడు ఫుడ్ ఐటమ్స్,ఏలూరు కార్పెట్ ,నెల్లూరు వుడెన్ కట్లరీ ,తూర్పు గోదావరి క్రోచెట్ లేస్ ప్రకాశం పచ్చళ్ళు,కోనసీమ చెక్క బొమ్మలు,ఎన్టీఆర్ హెర్బల్ ప్రొడక్ట్స్, బాటిక్ ప్రింట్ చీరలు,కాకినాడ కలంకారి డ్రెస్సులు,మాంగో జెల్లీ వైఎస్ఆర్ కడప సిల్క్ చీరలు,బాపట్ల చేనేత చేతితో ముద్రించిన వస్తువులు ,గుంటూరు మంగళగిరి చీరలు,పచ్చళ్ళు ,నంద్యాల జూట్, కాటన్ బ్యాగులు, ఆర్టిఫిషియల్ జ్యువెల్లరీ వంటి ఉత్పత్తులు ప్రత్యేక ఆకర్షణలుగా నిలుస్తున్నాయి



ప్రతి జిల్లా నుంచి ఒక ప్రత్యేక ప్రొడక్ట్... ప్రతి జిల్లా నుంచి ఒక ప్రత్యేక ప్రొడక్ట్‌ను జాతీయ స్థాయికి పరిచయం చేసేలా ఈసారి ట్రేడ్ ఫేర్ లో ప్రత్యేక పెవిలియన్ ఏర్పాటు చేశారు.. ఏపీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రదర్శిస్తున్న ప్రసిద్ధ అరకు ఫిల్టర్ కాఫీ ఘుమఘుమలు, అలాగే నెల్లూరు వుడెన్ కట్లరీ ఉత్పత్తుల అందం సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంటూ పెవిలియన్‌కు ప్రధాన హైలైట్‌గా నిలుస్తున్నాయి

జాతీయ స్థాయిలో ఏపీ బ్రాండింగ్!... దేశంలో మరెక్కడా లభించని అత్యంత ప్రత్యేకమైన చేనేత మరియు హస్తకళా ఉత్పత్తులు ఏపీలో ఉన్నాయన్నారు ఏపీ భవన్ స్పెషల్ రెసిడెంట్ కమిషనర్ అర్జా శ్రీకాంత్.. ట్రేడ్ ఫేర్ వేదికగా జాతీయ , అంతర్జాతీయ స్థాయిలో ఏపీకి వస్తువులకు వస్తున్న గుర్తింపు ఏపీ బ్రాండ్ ఇమేజ్‌ను మరింత పెంచుతుందన్నారు.... గత ఏడాది కూడా ఏపీ స్టాల్స్‌కు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించిందని, ఇక్కడి వ్యాపారులు మంచి లాభాలు ఆర్జించారని గుర్తుచేశారు.. ఇలాంటి ట్రేడ్ ఫెర్ లు స్థానిక తయారీదారులకు బిజినెస్ ప్రమోషన్ మరింత పెరిగి మంచి ఆర్థికాభివృద్ధి సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

సంపాదకీయం

ప్రజల కోసం రాహుల్ చేసే పోరాటానికి
అందరూ మద్దతివ్వాలి

: సీఎం రేవంత్

హైదరాబాద్: ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్య పరిరక్షణ, రాజ్యాంగ విలువలు, సామాజిక న్యాయం కోసం కలిసికట్టుగా పోరాడాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్ వేదికగా జరిగిన భారత్ సమిట్ ముగింపు సమావేశంలో సీఎం ప్రసంగించారు. ప్రజాస్వామ్యానికి, నియంతృత్వ ధోరణులకు మధ్య ప్రపంచవ్యాప్తంగా పోరాటం సాగుతోందని పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని, చట్టబద్ధ పాలనను కాపాడటం తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరిచి, అధికారాన్ని కొద్దిమంది చేతుల్లో కేంద్రీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ముఖ్యమంత్రి విమర్శించారు. 70 దేశాల నుంచి వెయ్యి మందికిపైగా ప్రతినిధులను ఆహ్వానించామని, అయితే వారిలో చాలామందికి కేంద్ర ప్రభుత్వం వీసాలు రద్దు చేసిందని రేవంత్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. పేదలు, మహిళలు, మైనారిటీలు, రైతులు సహా అన్ని వర్గాల హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు. ప్రజల ఆకాంక్షలు, ప్రాథమిక హక్కులు, విద్య, ఉపాధి, వైద్యం, ద్రవ్యోల్బణం వంటి సమస్యలు ప్రపంచవ్యాప్తంగా ఒకేలా ఉన్నాయని చెప్పారు. ఈ పోరాటానికి రాహుల్‌గాంధీ నాయకత్వం వహిస్తున్నారని, ఆయనకు అందరూ మద్దతుగా నిలవాలని కోరారు. సంపన్నుల ప్రయోజనాల కోసం కాకుండా సామాన్య ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వాలు పనిచేయాలని రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు.



సినీనటుడు గిరిబాబు
కన్నుమూత

హైదరాబాద్: ప్రముఖ తెలుగు సినీ నటుడు గిరిబాబు (80) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం తుది శ్వాస విడిచారు. 1946 జూన్ 8న ప్రకాశం జిల్లా కొరిశపాడు రావినూతల గ్రామంలో జన్మించిన ఆయన 'జగమే మాయ' చిత్రంతో సినీ పరిశ్రమకు పరిచయమయ్యారు. కథానాయకుడిగా, ప్రతినాయకుడిగా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా రాణించారు. 'సింహ గర్జన', 'మెరుపుదాడి', 'ఇంద్రజిత్', తదితర చిత్రాలకు నిర్మాతగా వ్యవహరించారు. 'రణరంగం', 'ఇంద్రజిత్' 'నీ సుఖమే నే కోరుకున్నా' వంటి చిత్రాలకు దర్శకత్వం వహించారు. గిరిబాబు సతీమణి 2016లో అనారోగ్యంతో కన్నుమూశారు. వీరికి ముగ్గురు సంతానం. కుమార్తె మాధవితో పాటు, రఘుబాబు, బోసుబాబు ఇద్దరు కుమారులు. రఘుబాబు హాస్యనటుడిగా కొనసాగుతున్నారు. 2023లో విడులైన 'అన్నీ మంచి శకునములే' గిరిబాబు నటించిన చివరి చిత్రం.



స్వగ్రామంలో గిరిబాబు అంత్యక్రియలు.. ఆరు నెలలుగా నాన్న అల్జీమర్స్, శ్వాసకోశ సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారని ఆయన తనయుడు రఘుబాబు అన్నారు. నాలుగు రోజుల కిందట తీవ్ర అస్వస్థతకు గురికావడంతో ఆస్పత్రిలో చేర్పించినట్లు తెలిపారు. పరిస్థితి విషమించడంతో శనివారం మధ్యాహ్నం కన్నుమూశారని వెల్లడించారు. ఆదివారం మధ్యాహ్నం స్వగ్రామం రావినూతలలో తండ్రి గిరిబాబు అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

మొదటి మూడు సినిమాలు ఆగిపోయాయి.. పాతతరం నుంచి నేటి తరం వరకూ నాలుగు దశాబ్దాలుగా చిత్ర రంగంలో రాణించిన నటుడు గిరిబాబు. ఆయన అసలు పేరు యర్రా శేషగిరిరావు. రైతు కుటుంబంలో జన్మించిన శేషగిరిరావు చిన్నప్పటి నుంచే సినిమాలంటే విపరీతమైన ఆసక్తి కనబరిచేవారు. ఊళ్లో ఉన్న టూరింగ్ టాకీస్‌లో ఎక్కువ సమయం గడిపేవారు. అంతా 'సినిమా పిచ్చోడు' అనేవారు. నటనలో రాణించాలనే సంకల్పం అప్పుడే ఏర్పడింది. తొలుత నాటకాలతో నట జీవితాన్ని ప్రారంభించిన ఆయన సొంతంగా నాటక సమాజాన్ని కూడా స్థాపించారు. ప్రేక్షకుల ఆదరాభిమానాలు, మిత్రుల తోడ్పాటుతో సినీ రంగంవైపు అడుగులు వేశారు. అలా మొదటి సినిమా 'ధైర్యే సాహసే లక్ష్మీ' మొదలైనా పూర్తి కాలేదు. ఆ తర్వాత 'తప్పటడుగులు' ఓకే అయినా అదీ ఆగిపోయింది. మూడో సినిమా 'స్వర్గానికి నిచ్చెనలు' ఆరు రీళ్ల తీశాక ఆపేశారు.



నాటకాలు వేస్తూనే సినీ అవకాశాల కోసం.. మూడు సినిమాలు ఆగిపోయినా తిరిగి ఇంటికి వెళ్లలేదు. ఎందుకంటే అప్పటికే ఆ మూడు సినిమాల గురించి పేపర్‌లో ప్రకటన వచ్చింది. మా ఊళ్లో (రావినూతల) అందరికీ తెలిసిపోయింది. ఏమీ సాధించకుండా వెనక్కి తిరిగి వెళితే అవమానమని గిరిబాబు భావించారు. పైగా అప్పటికే పెళ్లై ముగ్గురు పిల్లలు. సినిమాల్లో అవకాశాలు రాలేదని ఖాళీగా కూర్చోలేదు. నాటకాలు వేస్తూ వాటిల్లో రాణించారు. చివరకు 'జగమే మాయ' ద్వారా హీరోగా ఫస్ట్ టైమ్ స్క్రీన్ మీద కనిపించారు.

600లకు పైగా సినిమాల్లో రాణించి.. తెలుగు సినీ పరిశ్రమలో సుదీర్ఘ కెరీర్‌ను కొనసాగించిన నటుల్లో గిరిబాబు ఒకరు. రంగస్థలం నుంచి నట ప్రస్థానం ప్రారంభించిన ఆయన.. సినీ జీవితంలో పరిపూర్ణత సాధించారు. 'జగమే మాయ' తర్వాత 'జ్యోతి', 'మా దైవం', 'కురుక్షేత్రం', 'దేవతలారా దీవించండి' తదితర చిత్రాలు తొలినాళ్లలో ఆయనకు మంచి పేరు తెచ్చి పెట్టాయి. పాత్ర నిడివితో సంబంధం లేకుండా తన నటనతో అలరించేవారు. కొడుకుగా, తండ్రిగా, ఊరి పెద్దగా, ఇంటి పెద్దగా ఆయన ఎన్నో మరిచిపోలేని పాత్రలు చేశారు. 'మిస్టర్ అండ్ మిసెస్ శైలజా కృష్ణమూర్తి', 'భైరవద్వీపం', 'అల్లుడా మజాకా', 'ప్రేమ లేఖలు', 'హలో బ్రదర్', 'సిసింద్రీ', 'ప్రతిధి', 'కితకితలు', 'ఎవడైతే నాకేంటి', 'అతడు', 'నువ్వేకావాలి', 'బిందాస్', 'అ.. ఆ', 'గీత గోవిందం', 'శ్రీకారం' వంటి 600లకు పైగా చిత్రాల్లో నటించి మెప్పించారు.

సర్పంచి అభ్యర్థి హరిదాస్‌కు ఘన సన్మానం

శాలువా, పూలమాలతో సత్కరించిన ఎంపీటీసీ సాయిలీలా సతీష్ (లఫ్లీ)

సోమందేపల్లి నవంబరు14, అమరావతి వెలుగు మండల సర్పంచి అభ్యర్థి సీసీ హరిదాస్‌ను సోమందేపల్లి 1వ వార్డు ఎంపీటీసీ సాయిలీలా సతీష్ (లఫ్లీ) శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు ఆకుల రమణ, ఐటీడీపీ అధ్యక్షుడు నాగరాజు యాదవ్, బూత్ కన్వీనర్లు నటరాజ చారి, గంగాధర్, ప్రతాప్, మైలార యాదవ్, బొగ్గు నరసింహులు, ఉత్తప్ప, అనిల్, మన్సూర్, ఉప్పర ఓబులేసు, వినోద్, కృష్ణమూర్తి, గోపి, అమీర్, ఖాసీం తదితరులు హరిదాస్‌ను కలిసి శాలువా, పూలమాలతో సత్కరించి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో సోమందేపల్లి మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





ఎస్ పి వి ఎం కళాశాల విద్యార్థిని జిల్లా స్థాయి

క్విజ్ పోటీలకు ఎంపిక

గోరంట్ల, నవంబరు 14, అమరావతి వెలుగు : మండల కేంద్రంలోని ఎస్వీవీఎం కళాశాల విద్యార్థులు భువన విజయం ఆడిటోరియంలో నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన స్వీప్ ఓటర్ల అవగాహన కార్యక్రమంలో ఎస్‌పీవీఎం డిగ్రీ కళాశాల విద్యార్థిని ప్రతిభ కనబరిచింది. ఆర్డీఓ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన, క్విజ్ పోటీల్లో కళాశాలకు చెందిన నలుగురు విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో భాగంగా క్విజ్ కాంపిటీషన్‌లో కళాశాలకు చెందిన బీబీఏ తృతీయ సంవత్సరం విద్యార్థిని శ్రావణి ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైంది. త్వరలో నిర్వహించనున్న జిల్లా స్థాయి పోటీల్లో నియోజకవర్గ స్థాయిలో ఎంపికైన విద్యార్థులు పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు.జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన శ్రావణిని ఆర్డీఓ, తహసీల్దార్, విద్యాశాఖ అధికారి, రెవెన్యూ సిబ్బంది అభినందించి తదుపరి పోటీల్లోనూ విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లతో పాటు ప్రోగ్రామ్ ఆఫీసర్ బాలమోహన్ పాల్గొన్నారు.



స్వర్ణభారతి పాఠశాలలో అట్టహాసంగా

బాలల దినోత్సవ వేడుకలు

వివిధ పోటీల్లో విద్యార్థుల ప్రతిభాపాటవాలు.. విజేతలకు బహుమతుల ప్రదానం

తాళ్లపూడి, నవంబరు 14, అమరావతి వెలుగు :మండలంలోని స్థానిక స్వర్ణభారతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో బాలల దినోత్సవ వేడుకలు శనివారం ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను, ప్రతిభను వెలికితీసేందుకు పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో వివిధ పోటీలు నిర్వహించారు. పాటలు, నృత్యాలు, స్పెల్ బీ, చిత్రలేఖనం, వక్తృత్వం, వ్యాసరచన వంటి పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. చిన్నారుల ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి పాఠశాల కరస్పాండెంట్ పేరిచర్ల రామకృష్ణ రాజు, ప్రిన్సిపాల్ పేరిచర్ల పద్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చదువుతో పాటు సాంస్కృతిక, సాహిత్య పోటీల్లో పాల్గొనడం వల్ల విద్యార్థుల్లో మానసికవికాసం,ఆత్మవిశ్వాసంపెంపొందుతాయని తెలిపారు.అనంతరం వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు కరస్పాండెంట్ రామకృష్ణ రాజు, ప్రిన్సిపాల్ పద్మ చేతుల మీదుగా బహుమతులు అందజేసి అభినందించారు. ఈ వేడుకల్లో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.





అక్రమంగా తుమ్మ చెట్ల నరికివేత..

కలప తరలిస్తున్న వాహనం సీజ్

అటవీ సంపదకు నష్టం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని అటవీశాఖ అధికారుల హెచ్చరిక

పెనుకొండ, నవంబరు14, అమరావతి వెలుగు : జిల్లాలోని రొద్దం మండలం తురకలాపట్టం చెరువు సమీపంలో అక్రమంగా తుమ్మ చెట్లను నరికి, కలపను తరలిస్తున్న వాహనాన్ని



అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు.పెనుకొండ అటవీక్షేత్రాధికారి జె. మదన్ మోహన్ ఆదేశాల మేరకు అటవీ సెక్షన్ అధికారి కె. రాహుల్, అటవీ బీట్ అధికారి డి. శ్రీకాంత్ సంఘటనా స్థలానికి చేరుకుని తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అక్రమంగా కలపను తరలిస్తున్న వాహనాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం తదుపరి చట్టపరమైన చర్యల కోసం వాహనాన్ని అటవీశాఖ కార్యాలయానికి తరలించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ అటవీ సంపదను అక్రమంగా నరికివేయడం, ఎలాంటి అనుమతులు లేకుండా కలపను రవాణా చేయడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. ఇలాంటి అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అటవీ సంపద పరిరక్షణకు ప్రజలు కూడా అటవీశాఖకు సహకరించాలని కోరారు.

పంచాయతీ ఎన్నికలకు...

వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ఎంపికపై కసరత్తు







పుట్టపర్తి, నవంబరు 14, అమరావతి వెలుగు :

నల్లమాడ, ఓబుళదేవరచెరువు మండలాల్లో ఈ నెల 29న జరగనున్న గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి సర్పంచ్ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముమ్మరం చేసింది. పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి స్థానిక నాయకులు, ముఖ్య కార్యకర్తలతో సమావేశమై అభ్యర్థుల ఎంపికపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయా మండలాల్లోని గ్రామాల వారీగా పోటీ చేయాలనుకుంటున్న ఆశావహుల వివరాలు, స్థానిక రాజకీయ పరిస్థితులు, ప్రజల్లో వారికి ఉన్న ఆదరణ, క్షేత్రస్థాయిలో గెలుపు అవకాశాలపై సమీక్షించారు. స్థానిక నాయకుల అభిప్రాయాలను సేకరిస్తూ అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని సమర్థులైన అభ్యర్థులను బరిలోకి దింపేందుకు సమాలోచనలు జరిపారు. అందరినీ సమన్వయం చేసుకుంటూ ఎన్నికల బరిలో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో నల్లమాడ, ఓబుళదేవరచెరువు మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రుద్రవరం ఎంఈఓ గా కృష్ణమూర్తి

రుద్రవరం, నవంబరు 14, అమరావతి వెలుగు : మండల ఎంఈఓ గా కృష్ణమూర్తి శనివారం బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎంఈఓ గా ఇక్కడ విధులు నిర్వహిస్తున్న వెంకటస్వామి రెడ్డి ఇటీవల పదవి విరమణ పొందడంతో సంబంధిత ఉన్నతాధికారులు నన్నూల పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సీనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న తనను రుద్రవరం ఎంఈఓ 1 గా అదనపు బాధ్యతలను అప్పజెప్పడం జరిగిందన్నారు. అనంతరం నూతనంగా విధులు చేపట్టిన ఎంఈఓ ను సిబ్బంది , పలువురు ఉపాధ్యాయ బృందం పూలమాలతో చాలువలతో సన్మానించారు.



పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో బక్కన్నగారిపల్లిలో

పోలీసుల అవగాహన

ఎన్నికల నియమాలు పాటించాలి.. నేర కార్యకలాపాలకు దూరంగా ఉండాలి -- వేంపల్లి సీఐ

వేంపల్లి, నవంబరు 14, అమరావతి వెలుగు : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో వేంపల్లి మండలంలోని బక్కన్నగారిపల్లి గ్రామాన్ని వేంపల్లి సీఐ సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు సర్పంచ్ ఎన్నికల నిర్వహణ, ఎన్నికల నియమ నిబంధనలు, చేయాల్సిన పనులు, చేయకూడని పనులపై అవగాహన కల్పించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి గొడవలకు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకూడదని హెచ్చరించారు. ఎన్నికల రోజున శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలని సూచించారు.



రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలుకు...

'హయ్యెస్ట్ యాన్యువల్ ఫండ్' అవార్డు

నిడదవోలు, నవంబరు14, అమరావతి వెలుగు : రోటరీ ఫౌండేషన్ సేవా కార్యక్రమాల్లో విశేష ప్రతిభ కనబరిచినందుకు రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలుకు ప్రతిష్ఠాత్మక 'హయ్యెస్ట్ యాన్యువల్ ఫండ్' పురస్కారం లభించింది. తూర్పుగోదావరి జిల్లా కాకినాడలోని సూర్య కళామందిర్‌లో నిర్వహించిన రోటరీ ఫౌండేషన్ సెమినార్ అవార్డుల కార్యక్రమంలో ఆర్ఐ డిస్ట్రిక్ట్ 3020 పరిధిలో ఈ అవార్డును ప్రదానం చేశారు. అదేవిధంగా, క్లబ్‌కు చెందిన ఆర్‌టీఎన్ మీసాల శివరామ హరిప్రసాద్ 'హయ్యెస్ట్ యాన్యువల్ ఫండ్ డోనర్' పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు ఆర్‌టీఎన్ మారిశెట్టి అమ్మిరాజు, కార్యదర్శి ఆర్‌టీఎన్ చిలకల మల్లికార్జునరావుతో పాటు క్లబ్ సభ్యులు అవార్డు గ్రహీతలకు అభినందనలు తెలియజేశారు. ఈ పురస్కారాలు క్లబ్ సభ్యుల్లో మరింత సేవా స్ఫూర్తిని నింపాయని వారు పేర్కొన్నారు.



విజయలక్ష్మి నిశ్చితార్థ వేడుకల్లో పాల్గొని ఆశీర్వదించిన

పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

రెంటచింతల, నవంబరు 14, అమరావతి వెలుగు : మండలం పరిధిలోని పసర్లపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆరికట్ల చిన్న అక్కిరెడ్డి కుమార్తె విజయలక్ష్మి నిశ్చితార్థ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ శుభకార్యానికి పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామానికి విచ్చేసిన పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి ఆరికట్ల చిన్న అక్కిరెడ్డి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం వేడుకలో పాల్గొన్న ఆయన, నూతన వధువు విజయలక్ష్మిని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్తులో వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులతో కొద్దిసేపు ఆప్యాయంగా ముచ్చటించి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో రెంటచింతల మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు మరియు పసర్లపాడు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన వధువుకు శుభాకాంక్షలు తెలిపారు.





బీజేపీ బలోపేతానికి సమష్టిగా కృషి చేస్తాం

స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యం: ఎస్.ఆర్. పార్థసారథిరెడ్డి

పెనుకొండ, నవంబరు 14, అమరావతి వెలుగు : మండలంలోని గుడిపల్లిలో బీజేపీ రాష్ట్ర ప్రత్యేక ఆహ్వానితుడు, మాజీ మంత్రి సాయిప్రతాప్ అల్లుడు సాయి లోకేష్‌ను బీజేపీ యువ నాయకుడు ఎస్.ఆర్. పార్థసారథిరెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సాయి లోకేష్‌ను శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు. అనంతరం ఇరువురు నాయకులు ప్రస్తుత రాజకీయ పరిణామాలు, పార్టీ అభివృద్ధి, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. రానున్న రోజుల్లో బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు సమష్టిగా కృషి చేస్తామని పార్థసారథిరెడ్డి తెలిపారు.త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి, బీజేపీ అభ్యర్థుల విజయానికి విస్తృతంగా ప్రచారం నిర్వహించి, వారి గెలుపునకు శక్తివంచన లేకుండా పనిచేస్తామని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ కన్వీనర్ మంజు, కార్యదర్శి సురేష్, బాలాజీ, లోకి, పూజారి హరీష్, మధు తదితరులు పాల్గొన్నారు.



కిసాన్ సభ జాతీయ మహాసభలను...

జయప్రదం చేయాలి


ధర్మవరం, నవంబరు 14, అమరావతి వెలుగు : అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) 36వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు గరడంపల్లి గ్రామంలో మహిళా రైతు ఆనందమ్మతో జాతీయ మహాసభల ప్రచార జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, ఉపాధ్యక్షుడు ఏ. మారుతి మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి 18వ తేదీ వరకు తెలంగాణలోని నల్గొండ జిల్లాలో వేలాది మంది రైతులతో 36వ జాతీయ మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులు, మహిళా రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. శ్రీ సత్యసాయి జిల్లాలో రైతాంగాన్ని ఆదుకునేందుకు తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టాలని, రూ.25 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, జిల్లాలోని అన్ని చెరువులను పూర్తిస్థాయిలో నీటితో నింపడంతో పాటు ప్రతి చెరువుకు పిల్లకాలువలు ఏర్పాటు చేయాలని కోరారు. పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని, రైతుల రుణాలను పూర్తిగా మాఫీ చేయాలని, సాగుకు అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధి హామీ పథకాన్ని 200 రోజులకు పెంచి, రోజువారీ కూలి రూ.600కు పెంచాలని, గ్రామీణ ప్రాంతాల్లో గడ్డికేంద్రాలు ఏర్పాటు చేయాలని, తాగునీరు, సాగునీటి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రైతాంగ సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లేందుకు జాతీయ మహాసభలు వేదికగా నిలుస్తాయని పేర్కొంటూ రైతులంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం నాయకులు ఎస్.హెచ్. భాష, జె.వి. రమణ, రైతు సంఘం నాయకులు చంద్రశేఖర్, చంద్రాయుడు, నారాయణ, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.



నామినేషన్ల వేళ ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

శ్రీ సత్యసాయి జిల్లా, నవంబరు 14, అమరావతి వెలుగు : గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని అడిషనల్ ఎస్పీ అంకిత సురానా సూచించారు. జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ ఆదేశాల మేరకు శనివారం ధర్మవరం సబ్‌డివిజన్ పరిధిలోని ముదిగుబ్బ, పట్నం, రామస్వామి తండా గ్రామ సచివాలయాల వద్ద ఆదివారం జరగనున్న నామినేషన్ల స్వీకరణకు చేపట్టిన భద్రతా ఏర్పాట్లను ఆమె పరిశీలించారు.





పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థితో పాటు మరో ఇద్దరు ప్రతినిధులకు మాత్రమే నామినేషన్ కేంద్రంలోకి అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. కేంద్రాల వద్ద ర్యాలీలు, ఊరేగింపులు, నినాదాలు, ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం, గుంపులుగా చేరడం నిషేధమన్నారు. నామినేషన్ కేంద్రాల చుట్టూ 100 నుంచి 200 మీటర్ల పరిధిలో జనసమూహాలు గుమిగూడకుండా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా నిరంతర నిఘా కొనసాగిస్తూ పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ పర్యటనలో హిందూపురం డీఎస్పీ రవిబాబు, సీఐ సునీత, ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా

పరిటాల సునీత కసరత్తు

అనంతపురం, నవంబరు 14, అమరావతి వెలుగు : రాప్తాడు నియోజకవర్గంలో జరగనున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ఎమ్మెల్యే పరిటాల సునీత సర్పంచ్ అభ్యర్థుల ఎంపికపై కసరత్తు ముమ్మరం చేశారు. శనివారం అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంతో పాటు రామగిరి మండలం వెంకటాపురంలో ఆరు మండలాల ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులతో సుదీర్ఘంగా సమీక్షించారు. నియోజకవర్గ పరిధిలోని అనంతపురం రూరల్, ఆత్మకూరు, రాప్తాడు, రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాల్లోని గ్రామపంచాయతీల వారీగా సర్పంచ్ అభ్యర్థుల ఎంపికపై చర్చించారు. ఆయా పంచాయతీల రిజర్వేషన్లు, క్షేత్రస్థాయిలో అభ్యర్థుల బలాబలాలు, గెలుపు అవకాశాలు, పార్టీకి చేసిన సేవలు, విధేయత, నాయకుల అనుభవం వంటి అంశాలపై నాయకుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. పార్టీ కోసం గత ఐదేళ్లుగా కష్టపడిన వారికి ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు, ఉత్సాహంగా పనిచేస్తున్న యువతకు అవకాశాలు కల్పించే అంశంపైనా చర్చించారు. నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం సాధిస్తూ పార్టీలో విభేదాలకు తావులేకుండా బలమైన అభ్యర్థులను ఎంపిక చేయాలని ఎమ్మెల్యే దిశానిర్దేశం చేశారు. ఇదిలా ఉండగా, ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో రాప్తాడు మండల జడ్పీటీసీగా విజయం సాధించిన జయలక్ష్మి అనంతపురం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పరిటాల సునీతను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జయలక్ష్మిని ఎమ్మెల్యే అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ నిరంతరం ప్రజాసేవలో ఉండాలని సూచించారు. ఈ సమావేశాల్లో ఆరు మండలాలకు చెందిన తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





వైఎస్సార్‌సీపీలో చేరిన...

పులగంపల్లి, దొన్నికోట టీడీపీ నాయకులు

పుట్టపర్తి నవంబరు14, అమరావతి వెలుగు పుట్టపర్తి నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు చేరారు. పులగంపల్లి గ్రామం, దొన్నికోట పంచాయతీ పరిధికి చెందిన వారు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌ఛార్జి దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కండువాలు కప్పుకుని వైఎస్సార్‌సీపీలో చేరారు. పులగంపల్లికి చెందిన మహమ్మద్ రఫీక్, పఠాన్ ఇమ్రాన్, బీరే చంద్రశేఖర్ నాయుడు, మున్వర్ బాషా, చాంద్ బాషా, దొన్నికోటకు చెందిన కె.వెంకటరమణ, కె.రవి, టి.దైవాదినం పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆశయాలు, విధానాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. ఈ చేరికలతో నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తామని పేర్కొన్నారు.





జనగణన యాప్ వినియోగంపై క్షేత్రస్థాయి శిక్షణ

అనంతపురం, నవంబరు 14, అమరావతి వెలుగు : జనగణన రెండో దశలో భాగంగా ఎన్యూమరేటర్ జేఎన్‌టీయూలో ఈ నెల 13న ప్రారంభమైన మొదటి విడత శిక్షణ కార్యక్రమం శనివారం సాయంత్రం ముగిసింది. రెండు రోజులపాటు నిర్వహించిన ఈ శిక్షణలో చివరి రోజు క్షేత్రస్థాయిలో ఇంటింటి సర్వే నిర్వహించే విధానంపై సిబ్బందికి ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. మాస్టర్ ట్రైనర్లు జి.ఎల్.ఎన్. ప్రసాద్, కిరణ్ జనగణన యాప్ వినియోగం, వివరాల నమోదు, ఇంటింటి సర్వే నిర్వహణ విధానాలను క్షేత్రస్థాయిలో వివరించారు. జనగణన ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేస్తూ, సర్వే సమయంలో సేకరించాల్సిన వివరాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సెన్సెస్ ఉప తహసీల్దార్ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.



నామినేషన్లకు పటిష్ట పోలీస్ బందోబస్తు..

విధులపై సిబ్బందికి డీఎస్పీ సి.మాణిక్యరావు దిశానిర్దేశం

ధర్మవరం: గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా జరిగేలా పోలీసు యంత్రాంగం పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ ఆదేశాల మేరకు ధర్మవరం పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పుట్టపర్తి డీఎస్పీ సి. మాణిక్యరావు తెలిపారు. ఈ నేపథ్యంలో ధర్మవరం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నామినేషన్ కేంద్రాల బందోబస్తు విధులకు హాజరైన పోలీసు అధికారులు, సిబ్బందికి డీఎస్పీ భద్రతా విధులపై తగిన సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. విధులకు కేటాయించిన సిబ్బంది నిర్దేశిత సమయానికి హాజరై అప్రమత్తంగా బాధ్యతలు నిర్వర్తించాలని, ఎన్నికల నియమావళి అమలులో నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు. అనంతరం నామినేషన్ కేంద్రాల వద్ద చేపట్టిన భద్రతా ఏర్పాట్లను డీఎస్పీ క్షేత్రస్థాయిలో పరిశీలించి బందోబస్తు విధుల నిర్వహణను పర్యవేక్షించారు. సబ్ డివిజన్ పరిధిలోని ఎస్సైలు, పోలీసు సిబ్బందికి కేంద్రాల వారీగా విధులు కేటాయించి, ప్రతి కేంద్రం వద్ద నిరంతర పోలీస్ నిఘా ఉండేలా చర్యలు తీసుకున్నారు. నామినేషన్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కేంద్రాల పరిసరాల్లో గుంపులుగా చేరడం, ర్యాలీలు, నినాదాలు వంటి చర్యలకు తావులేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సిబ్బందిని ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులు తలెత్తినా సంయమనం పాటిస్తూ చట్టపరిధిలో చర్యలు తీసుకోవాలని, సమస్యాత్మక పరిస్థితులపై వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ పూర్తయ్యే వరకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహిస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని డీఎస్పీ మాణిక్యరావు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కొత్తచెరువు అప్‌గ్రేడ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె. రాజశేఖర్, పుట్టపర్తి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సురేష్, నల్లమాడ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, సబ్ డివిజన్ పరిధిలోని ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.













గ్రామపంచాయతీ నామినేషన్ కేంద్రాల వద్ద...

పటిష్ట పోలీస్ బందోబస్తు

శ్రీ సత్యసాయి జిల్లా, నవంబరు14, అమరావతి వెలుగు : ధర్మవరం పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో ఆదివారం నుంచి ప్రారంభం కానున్న గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు పటిష్ట పోలీస్ భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ తెలిపారు. నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా జరిగేలా అన్ని కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. నామినేషన్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు భద్రతా చర్యలు తీసుకున్నామని, కేంద్రాల పరిసర ప్రాంతాలపై నిరంతర నిఘా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. డ్రోన్లు, సీసీ కెమెరాల ద్వారా ఆయా ప్రాంతాలను ప్రత్యేకంగా పర్యవేక్షిస్తూ పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించనున్నట్లు పేర్కొన్నారు. నామినేషన్ల స్వీకరణలో ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించినట్లు ఎస్పీ తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు పోలీస్ శాఖకు సహకరించాలని ఆయన కోరారు.



దేశాభివృద్ధికి యువత వినూత్న ఆలోచనలు

పంచుకోవాలి

అనంతపురం, నవంబరు 14, అమరావతి వెలుగు : వికసిత్ భారత్ నిర్మాణంలో యువత ఆలోచనలు, సృజనాత్మకత, నూతన ఆవిష్కరణలు కీలక పాత్ర పోషిస్తాయని జిల్లా రెవెన్యూ అధికారి ఏ. మాలోల, జేఎన్‌టీయూ ఉపకులపతి ఆచార్య హెచ్. సుదర్శన్ రావు పేర్కొన్నారు. భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మేరా యువ భారత్--అనంతపురం, ఆన్సెట్ సంయుక్తంగా జేఎన్‌టీయూ ఆర్యభట్ట ఆడిటోరియంలో నిర్వహించిన జిల్లా స్థాయి వికసిత్ భారత్ చాలెంజ్ ట్రాక్ పీపీటీ ప్రజెంటేషన్ పోటీలను వారు ప్రారంభించారు. వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్--2027లో భాగంగా నిర్వహించిన ఈ పోటీల్లో అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలకు చెందిన యువత పాల్గొన్నారు. మేరా యువ భారత్ పోర్టల్ ద్వారా నిర్వహించిన క్విజ్, వ్యాసరచన పోటీల్లో అర్హత సాధించిన వారికి తదుపరి దశగా ఈ ప్రజెంటేషన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి 12 మంది యువతను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రస్థాయిలో విజయం సాధించిన వారికి జనవరిలో ఢిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించనున్న జాతీయస్థాయి వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్--2027లో పాల్గొనే అవకాశం కల్పిస్తామన్నారు. ప్రధానమంత్రి సమక్షంలో దేశాభివృద్ధికి సంబంధించిన తమ వినూత్న ఆలోచనలు, సూచనలు వెల్లడించే అవకాశం ఉంటుందని తెలిపారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ప్రతిభ చాటి జాతీయ స్థాయికి ఎదగాలని అతిథులు పిలుపునిచ్చారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా జిల్లా రెవెన్యూ అధికారి ఏ. మాలోల, జిల్లా పర్యాటక అధికారి రమణరెడ్డి, అసోసియేట్ ప్రొఫెసర్ డా. జి. మమత, సెంట్రల్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. ఓ. ప్రణతి, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. పి. సత్యసౌమ్య వ్యవహరించారు. పాల్గొన్న యువతకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆన్సెట్ సీఈఓ ఎన్. రవిశంకర్ రెడ్డి, మేరా యువ భారత్ ప్రతినిధి బిసాతి భరత్, ఆన్సెట్ మేనేజర్ సి. శ్రీనివాసులు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత బిసాటి జీవన్ కుమార్, మేరా యువ భారత్ వాలంటీర్లు, ఆన్సెట్ సిబ్బంది, యువతీ యువకులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ

వారోత్సవాలు ప్రారంభం

ముదిగుబ్బ నవంబరు 14, అమరావతి వెలుగు : ముదిగుబ్బ శాఖా గ్రంథాలయంలో 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు శనివారం గ్రంథాలయ అధికారి ప్రతాప్ ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాశాఖ అధికారి వెంకటరమణప్ప తొలుత జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, పాఠకులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పుస్తక పఠనం ద్వారా విజ్ఞానం, వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకోవచ్చన్నారు. గ్రంథాలయ అధికారి ప్రతాప్ మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 14న బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, 16న ప్రముఖులపై ప్రసంగాలు, 17న సదస్సులు, 18న విద్యార్థులకు వివిధ అంశాల్లో ఆటల పోటీలు, 19న మహిళా దినోత్సవ కార్యక్రమం, 20న ముగింపు వేడుకలతో పాటు విజేతలకు బహుమతుల ప్రదానం ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది ఖాదర్ భాష, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.



Edited, Printed, Published & Owned by : JANAPATI VENKATA RAMESH BABU, #1-1189-21A, NGO Colony, KADIRI - 515591, Anantapuramu (Dist.), AP (State) and Printed at M/s AK PUBLICATIONS, #1-1189-2A, NGO Colony, Kadiri - 515591, Anantapuramu (Dist), AP (State) and Published at #1-1189-21A, NGO Colony, Kadiri - 515591, Anantapuramu (Dist.), (A.P), Editor : JANAPATI VENKATA RAMESH BABU, RNI No. APTEL / 2022 / 85169, E-mail : amaravathivelugu@gmail.com, Cell: 9440814576